అతనికి ఎంతో ఆశ్చర్యం వేసింది. ఓ రోజు ఆ కొడుక్కి ఆ సన్యాసి చెరువు ఒడ్డున ధ్యానం చేసుకుంటూ కనిపించాడు. వెంటనే కొడుకు అతన్ని ప్రశ్నించాడు.

"మీరు చెప్పినట్లుగానే చేసాను. మా నాన్న పుర్రెలో ఎంత డబ్బు వేసినా అదెందుకు నిండటం లేదు?"

"అది ఓ దురాశాపరుడైన లోభి పుర్రె కాబట్టి అందులో ఎంత డబ్బు వేసినా సరిపోదు. నువ్వు అంతకు మించిన లోభివి కాబట్టి అందులోంచి తీసి వుండవు. ఇంటికి వెళ్ళి తీసి చూడు. ఏమవుతుందో తెలుస్తుంది."

కొడుకు ఇంటికి వెళ్ళి పుర్రె లోంచి ఓ నాణెం తీయడానికి ప్రయత్నిస్తే ఒక్కటీ బయటికి రాలేదు.

అంతులేని ఆశతో అవసరమైన దానికంటె ఎక్కువ వెనకేసుకోవడం మంచిది కాదన్న పాఠాన్ని అర్థం చేసుకున్న ఆ కొడుకు, తన లోభత్వాన్ని చంపుకుని లేనివారికి సహాయం చేయడం నేర్చుకున్నాడు.

## 21. దాన కర్ణుడు

కర్ణుడి దాతృత్వం గురించి ఎవరో పొగుడుతూంటే అర్జునుడు దాన్ని విని సహించలేక పోయాడు. పక్కనే ఉన్న శ్రీకృష్ణుడు అది గ్రహించి అర్జునుడికి తగిన గుణపాఠం నేర్పాలనుకున్నాడు. మర్నాడు అర్జునుడ్ని తన ఇంటికి భోజనానికి ఆహ్వానించాడు. అతనికో చిన్న బంగారు పాత్రని ఇచ్చి చెప్పాడు.

"దీన్లో బంగారు నాణాలున్నాయి. వస్తూ, వస్తూ వాటిని త్వరగా దానం చేసిరా. ఎందుకంటే కర్ణుడ్ని కూడా భోజనానికి పిలిచాను. నీవల్ల అతనికి భోజనం వడ్డించడం ఆలస్యం చేయడం బావుండదు."

మర్నాడు అర్జునుడు కృష్ణుడి ఇంటికి బయలుదేరాడు. దారిలో నగర కూడలిలో కూర్చుని వచ్చేపోయే వారిని పిలిచి ఆ బంగారు గిన్నెలోని నాణాలని దానం చెయ్యసాగాడు. త్వరలోనే అర్జునుడి ముందు చాలామంది గుమిగూడి వాటిని స్వీకరించసాగారు. అర్జునుడు ఎందరికి దానం చేసినా ఆ పాత్రలోని నాణాలు తరగటం లేదని గ్రహించాడు. ఎంత వేగంగా అతను నాణాలని

తీసినా అవి మళ్ళీ అదే వేగంతో భర్తీ అవసాగాయి. అవతల అంతా తనకోసం ఎదురు చూస్తుంటారు. ఇంతలో శ్రీకృష్ణుడి ఇంటికి భోజనానికి బయలుదేరిన కర్ణుడు అర్జునుడికి కనబడ్డాడు. వెంటనే కర్ణుడి చేతిలో ఆ బంగారు పాత్రని ఉంచి చెప్పాడు అర్జునుడు.

"మిత్రమా! ఈ గిన్నెలోని నాణాలని కొన్నిటిని నేను దానం చేసాను. మిగిలినవి నువ్వు చెయ్యి."

కర్ణుడి చేతిలో ఆ బంగారు పాత్రని ఉంచి అర్జునుడు చల్లగా జారుకున్నాడు. కాని, తన వెనకే కర్ణుడు శ్రీకృష్ణుడి ఇంట్లోకి రావడం గమనించిన అర్జునుడు ఆశ్చర్యపోయాడు.

"ఇంత త్వరగా వచ్చేసావు. దానం మాట ఏంచేసావు?" ప్రశ్నించాడు.

"నువ్వు చెప్పినట్లే దానం చేసి వస్తున్నాను. ఆ గిన్నెని ఓ ముసలి బీదరాలి చేతిలో ఉంచి వస్తున్నాను." బదులు చెప్పాడు కర్ణుడు.

కర్ణుడికి దాన కర్ణుడన్న కీర్తి ఎందుకు వచ్చిందో వెంటనే అర్జునుడికి అప్పుడు కాని అర్థం కాలేదు.

## 22. స్వస్వరూపం

ఓ అడవిలో ఎవరితో సంబంధం లేకుండా చాలాకాలంగా జీవిస్తున్న తొలి మానవుల జంటలోని మగతనికి ఓ అద్దం దొరికింది. అలాంటిది అతను ఎన్నడూ అంతదాకా చూసి వుండలేదు. అందులో కనిపించింది దేవుడి మొహం అనుకుని దాన్ని పూజ గదిలో వుంచి నిత్యం పూజించసాగాడు.

అతని భార్య ఇది గమనించి ఆ అద్దాన్ని తీసి చూసింది. అందులో ఆమెకి తన మొహం ప్రతిబింబం కనిపించింది. అది తన సవతి మొహం అనుకుందామె. ఆ మగతనికి కాని, అతని భార్యకి కాని ఆ అద్దంలో కనిపించింది తామే అని తెలీదు.

మన అసలు స్వస్వరూపం ఏమిటో తెలీని మన గతి కూడా ఆ జంట గతి లాంటిదే. దాన్ని తెలుసుకునే ప్రయత్నం చేయడమే వివేకం.